

నిబంధనలు బేఖాతరు
● పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తున్న బొగ్గు లారీలు 6

అజోలా సాగు...భలే బాగు 7

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

గర్మిళ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు, రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామని విద్యుత్ మంచిర్యాల సర్కిల్ సూపరిండెంటెంట్ ఇంజనీర్ గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా సర్కిల్‌లోని డీఈ, టెక్నికల్ అధికారులు, సేఫ్టీ అధి కారులను నియమించి వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌తీగలు, తెగిన విద్యుత్ తీగలు తాకవద్దని సూచించారు. పశువులను మేతకు తీసుకువెళ్లేటప్పుడు పశువులు ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు..

సింగరేణి అధికారుల బదిలీలు

మందమర్రిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి వ్యాప్తంగా మైనింగ్ విభాగానికి సంభందించిన పలువురు అధికారులను బదిలీ చేస్తూ కొత్తగూడెం కార్పొరేట్ నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏజెంట్లు, గ్రూపు ఏజెంట్లతో పాటు గని మేనేజర్లు, అడిషనల్ మేనేజర్‌లు, అండర్ మేనేజర్‌లు ఉన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే 5 గనికి చెందిన మేనేజర్ ప్రవీణ్‌పంటింగ్ గోదావరిఖనిలోని అడ్రియాల ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు.

వెయిట్ లిఫ్టర్‌కు సన్మానం

మందమర్రిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి వెయిట్ లిఫ్టర్ అక్షయ్‌కుమార్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. రెండు రోజుల క్రితం నస్పూర్‌లో జరిగిన తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా 70 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. తిరుమల్, రాయబారపు కిరణ్, పాల్గొన్నారు.

ఒడిశా టూ మంచిర్యాల..

రాష్ట్ర సరిహద్దులు దాటుతున్న గంజాయి



- జిల్లాలో జోరుగా విక్రయాలు
- యువత, కళాశాలల విద్యార్థులే లక్ష్యం
- విస్తరిస్తున్న హెరాయిన్ వినియోగం
- పోలీసుల కళ్లుగప్పి జిల్లాకు అక్రమ రవాణా

మంచిర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి వినియోగం చాపకింద నీరులా విస్తరిస్తోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా యువత, కళాశాలల విద్యార్థులే లక్ష్యంగా ఏజెంటు వ్యవస్థ రూపుదిద్దుకోవడం ఆందోళనకు గురి చేస్తోంది. మంచిర్యాల పట్టణ కేంద్రంగా గంజాయి సరఫరా యదేశ్చగా కొనసాగుతుండగా, బానిసైన యువత దాని కోరల్లో చిక్కి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గంజాయి అడ్డాలు ఏర్పాటు అయినట్లు పసిగట్టిన నిఘా వ్యవస్థ దాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నప్పటికీ, అధికారుల కళ్లుగప్పుతున్న విక్రయదారులు తమ లక్ష్యం చేధించేందుకు పలు మార్గాలను అన్వేషిస్తున్నారు. మరో రకమైన మత్తుపదార్థం హెరాయిన్ వినియోగం కూడా జిల్లాలో పెద్ద మొత్తంలో విస్తరించినట్లు తెలుస్తోంది.

రోడ్డు, రైలు మార్గాల ద్వారా...

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రధాన రైలు మార్గం అందుబాటులో ఉండటంతో దాన్ని గంజాయి స్మగ్లర్లు సరుకు రవాణాకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర, వరంగల్ ప్రాంతం నుంచి పలు రైళ్ల ద్వారా, ఒడిశా నుంచి మంచిర్యాలకు రోడ్డు మార్గంలో గంజాయిని తరలిస్తున్న వ్యాపారులు దాన్ని ఇక్కడి ఏజెంట్లకు విక్రయిస్తున్నారు. ఏజెంట్లు ప్యాకెట్ల రూపంలోకి మార్చి వివిధ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. 2023 సెప్టెంబరులో ఛత్తీస్‌ఘడ్ నుంచి రోడ్డు మార్గంలో గంజాయిని తరలిస్తున్న ట్రాక్టర్ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద బోల్తా పడటంతో గంజాయి అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. ట్రాక్టర్‌ను అక్కడే వదిలి స్మగ్లర్లు పరారు కాగా, రెండు రోజుల అనంతరం ట్రాక్టర్‌ను పరిశీలించిన పోలీసులకు అందులో కొన్ని పత్రాలు లభించాయి. పత్రాలపై ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులోని బలిమెల చెక్‌పోస్టు పాసింగ్ ఉండటంతో పోలీసు బృందం విచారణ కోసం అక్కడికి వెళ్లింది.

గుట్టు చప్పుడు కాకుండా రవాణా...

వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి గంజాయి జిల్లా కేంద్రానికి పెద్ద మొత్తంలో గుట్టు చప్పుడు కాకుండా దిగుమతి అవుతోంది. సీసీ కెమెరాల అమ్మకాల ముసుగులో గంజాయి వ్యాపారం చేస్తూ పోలీసులకు చిక్కిన సంఘటన గత నెల 20న జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. ఈ ఘటనలో ఏకంగా రూ. 11.75 లక్షల విలువైన 23.5 కిలోల గంజాయి పట్టుపడగా, 22 మందిపై కేసు న మోదైంది. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాంప్లెక్ సెల్లార్‌లో కొంతకాలంగా గంజాయి వ్యాపారం జరుగుతుండగా, సోమ ప్రవీణ్ అనే వ్యక్తి సీసీ కెమెరాల ముసుగులో గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఆంధ్ర ప్రాంతంలోని సీలేరు నుంచి గంజాయి తీసుకువ స్తున్న ప్రవీణ్, అతని ముఠా సీలేరు నుంచి గంజా యిని కారులో ఎస్కార్ట్ సహాయంతో మంచిర్యాలకు తరలించారు. మళ్లీ ఫిబ్రవరి ఒకటో తేదీన సీలేరు నుంచే సరుకు...

మిగతా 7లో

దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవోలు శ్రీనివాస రావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. లక్షెట్టిపేట మండల కేంద్రానికి చెందిన అంబటి పద్మతన భర్త పక్షవా తంతో బాధపడుతున్నాడని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ అందజేసింది. అలాగే కాసిపేట, భీమిని, దండేపల్లి, జన్నారం, బెల్లంపల్లి మండలాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దిలీప్ కుమార్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరకాస్తులు స్వీకరించారు. చాలా సంవత్సరాలుగా భూతగాదాలతో ఇబ్బంది పడు తున్న ప్రజలకు ఇక నుండి ఏలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు కలెక్టర్ కొత్త ఆలోచన చేపట్టారని ఆలాంటి సమస్యలు ఉంటే ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ పోలీస్ సంయుక్తంగా ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు తగాదాలకు సంభందించి ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తామన్నారు. ఆ దకరాస్తును 15రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మారుతిప్రసాద్, ఎంపీడీవో సరోజ, ఎస్సై సతీష్, ఏవో శ్రీకాంత్, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం రెవెన్యూ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భూతగాదాల సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఐ శ్రీధర్, ఎంపీవో శ్రీపతి బాపురావులు పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఇందులో చెన్నూరు మున్సిపాలిటీలో ఇంటి ధృవీకరణ పతం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో మో హన్, ఎంపీవో అజ్మత్ ఆలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవానీ, ఏవో యామిని, ఏపీఎం ప్రమీల, అంగన్‌వాడీ సూపర్ వైజర్ మాధవి, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ తగదుల పరిష్కారానికి తహసీల్దార్, ఎస్సై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరాఖాస్తులు స్వీకరించినట్లు తహసిల్దార్ సంధ్యరాణి, ఎస్సై తైసిపోద్దీన్ తెలిపారు. ఎంపీడీవో జేఆర్‌ప్రసాద్, ఈజీఎస్ ఏపివో దుర్గదాస్, ఐకేపి ఏపిఎం బ్రహ్మయ్య ఉన్నారు.

కాసిపేట : గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించేందుకు మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భోజన్న తెలిపారు. ఉద యం 10.30 గంటల నుంచి 2గంటల వరకు పోలీ సు, రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, వ్యవసాయాధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

భీమారం : భీమారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ సదానందం మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు.

చట్ట పరిధిలో సామాన్యుడికి న్యాయం...

- ల్యాండ్ మాఫియా, అక్రమ దందాలపై ఉక్కుపాదమే...
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా...



సీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో పోలీసులను ఆశ్రయించే సామాన్యుడికి న్యాయం జరిగేలా చూస్తామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే బాధితులు తనను నేరుగా కలువవచ్చునని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. సోమవారం రామగుండం కమిషనరేట్‌లో నూతన కమిషనర్‌గా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ 24గంటలు పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామ న్నారు. సత్ప్రవర్తన, మంచి నడవడిక కలిగిన వారికి, ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తా మని, అదే సమయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నూతన టెక్నాలజీతో నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్టు సీపీ తెలిపారు. ల్యాండ్ మాఫియా, డ్రగ్స్, గంజాయి రవాణా పట్ల ఉక్కుపాద మోపుతామన్నారు.

2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి...

అంబర్ కిశోర్ ఝా 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2011లో మొట్ట మొదటిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏఎస్‌పీగా పని చేసిన 2012లో వరంగల్ ఓఎస్‌డీగా, అదనపు ఎస్‌పీగా పని చేశారు. 2014లో వరంగల్ రూరల్ ఎస్‌పీగా పని చేసిన ఆయన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత భద్రాద్రి కొత్తగూడెం తొలి ఎస్‌పీగా బాధ్యతలు నిర్వహించారు. 2018లో హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా పని చేసి అదే సంవత్సరం కేంద్ర సర్వీసులో విధులు నిర్వహించారు. గత సంవత్సరం డీఐజీగా పదోన్నతి పొంది రాచకొండ జాయింట్ సీపీగా పని చేశారు. అనంతరం వరంగల్ సీపీగా పని చేసి ప్రస్తుతం రామగుండం కమిషనర్‌గా నియమింపబడ్డారు. నూతన సీపీకి అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, డీసీపీ భాస్కర్, పెద్దపల్లి డీసీపీలు కరుణాకర్, ఏసీపీలు, ఆర్‌ఐలు స్వాగతం పలికారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ.600కోట్లు మంజూరు

మంచిర్యాల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు ప్రభుత్వం రూ.600కోట్లు మంజూరుచేస్తు సోమవారం ప్రభుత్వం జీవో నంబర్ 56ను విడుదల చేసింది. ఈమేరకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధిని సాధించేందుకు నియోజకవర్గానికి ఒక అత్యున్నతమైన విలువలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా మంచిర్యాల, చెన్నూర్ నియోజిక వర్గాల్లో మంజూరు అయిన పాఠశాలలకు ఇప్పటికే శంకుస్థాపనలు చేయగా బెల్లంపల్లిలో త్వరలో చేయనుంది. ఇందులో భాగంగా నియోజకవర్గానికి రూ.200కోట్లు మంజూరుచేస్తు జీవో విడుదల అయ్యింది.



దండేపల్లిలో సీఎం, డిప్యూటి సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

దండేపల్లి: మండలం రెబ్బనపల్లి శివారులో నూతనంగా నిర్మంచ తలపెట్టే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ. 200 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈసందర్బంగా దండేపల్లిలో బస్టాండ్ సమీపంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు భారీ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. రెండు జేసీబీ యంత్రాల సాయంతో కాంగ్రెస్ శ్రేణులు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చందు, వైస్ చైర్మన్ ఎండి ఆరీఫ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కల వెంకటేశ్వర్లు, తూముల నరేష్ పింగిలి రమేష్, ఆర్టీఏ డైరెక్టర్ అంకతి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

గర్మిళ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని ఆర్డీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఉత్తమ మహిళలుగా ఎంపికైన వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, అధికారులు రమేష్, సంధ్యారాణి, టీఎన్‌జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయునీలు అనిత, లిల్లిజోయెల్, అనూష, గీత, సుష్మిత, హరీష్‌లతో పాటు మోడల్ స్కూల్ హాస్టల్ కేర్ టేకర్ స్వరూప, హాస్టల్, పాఠశాలల సిబ్బందిని ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి బహుమతులు అందించారు.



వేడుకల్లో పాల్గొన్న ఆర్డీవో, అధికారులు

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

ఏసీపీ రవికుమార్

మందమర్రి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పాటుపడాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన, వాటివల్ల జరిగే అనర్ధాలపై యువతకు అవగాహన కల్పించేందుకు బెల్లంపల్లి పోలీసు డివిజన్ ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహిస్తున్న క్రికెట్‌పోటీలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడిపించే లక్ష్యంతో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఏడు రోజుల పాటు మందమర్రిలో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్‌ను పాడు చేసు కోవద్దన్నారు. క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం మందమర్రి ప్రెస్‌క్లబ్ వర్సెస్ పోలీసు టీం తలపడగా పోలీసు జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్ర మంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

అధికారులు ప్రజలతో మమేకమై పనిచేయాలి



క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, వైద్యులు

గర్మిళ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలోని గెజి టెడ్ అధికారులు ప్రజలతో మమేకమై పనిచేయాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో గెజిటెడ్ అధికారుల టూర్ డైరీని క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలతో మమేకమై జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలను ప్రజలకు అందుబాటులో తేవాలన్నారు. ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇతర డిపార్టు మెంట్లతో సమన్వయంతో పనిచేయాలని, వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు, కీటక జనితవ్యాధుల అసంక్రమణ వ్యాధులు ప్రబలుతున్నందున వాటిపైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు ప్రసాద్, సీతారామారాజు, కృపాబాయి, శివ ప్రతాప్, విశ్వేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కాంతారావు, ఎస్‌వో వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, రమేష్, రాఘవ, బుక్కా వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

సీపీకి ఘనంగా వీడ్కోలు



సీపీ ఉన్న వాహనాన్ని తాడుతో లాగుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రామగుండం సీపీ శ్రీనివాస్ బదిలీపై వెళ్తుండగా సోమవారం పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీస్ కమిషనరేట్‌లో గజమాలలతో సత్కరించి హెడ్ క్వార్టర్స్ గేటు వరకు అధికారులు, సిబ్బంది వాహనానికి తాడు కట్టి లాగారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

చెన్నూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ మెడ నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని విశ్వకర్మ కాలనీకి చెందిన మణెమ్మ అనే వృద్ధురాలు సోమవారం సాయంత్రం తన అవసరం నిమిత్తం పాత బస్టాండ్ ప్రాంతానికి వస్తుండగా ఆమెను అటకాయించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెతో మాటలు కలుపుతూ ఆమె మెడలో నుంచి 2 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. తేరుకున్న మణెమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు చెన్నూరు పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా చోరీ చేసిన వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నేరాల అదుపునకు చర్యలు

- ఎస్సై రాజు,



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: నేరాల అదుపునకు చేపడుతున్న చర్యలు ఏమిటి?

ఎస్సై : నేరాల అదుపునకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. బ్లూకోల్ట్స్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేస్తున్నాం. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: దహెగాం మండల కేంద్రంలో ఎన్ని సీసీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు?

ఎస్సై : దహెగాం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో 17 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మరిన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. సీసీ కెమెరాలతో నేరాలను అదుపుచేసే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో గుడుంబా, బెల్టు షాపుల ద్వారా మద్యం జోరుగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి?

ఎస్సై : కమ్మర్‌పల్లి, దేవులగూడెం, కల్వాడ, చంద్రపల్లి గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు చేపట్టి నెలలో నాలుగైదు కేసులు నమోదు చేస్తున్నాం. గుడుంబా, బెల్టు షాపులను అరికట్టడానికి తరుచు తనిఖీ చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రైవేటు వాహనాలు నడిపే వారికి ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

ఎస్సై : వాహనాల ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్సు, సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచిస్తున్నాం. పత్రాలు సక్రమంగా లేని వారికి జరిమానా విధిస్తున్నాం. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పని సరిగి హెల్మెట్ ధరించాలి.

- దహెగాం, ఆంధ్రజ్యోతి

నిబంధనలు బేఖాతరు

- పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తున్న బొగ్గు లారీలు
- టార్పాలిన్లు కప్పకుండానే బొగ్గు రవాణా
- స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు



టార్పాలిన్ లేకుండా బొగ్గులోడ్‌తో వెళుతున్న లారీ

వృద్ధులు, చిన్నారుల ఇబ్బందులు

రెబ్బెన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్టు నుంచి గోలేటి క్రాస్ రోడ్డు సమీపంలోని సీహెచ్‌పీకి బొగ్గు తరలించే లారీలు రాకపోకల సందర్భంగా పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తున్నాయి. డ్రైవర్లు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలను నడపటం ద్వారా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు కావటంతో వాటి రాకపోకల సందర్భంగా జనాలతో పాటు వాహనదారులు కూడా భయపడే పరిస్థితి నెలకొంటున్నాయి. ముఖ్యంగా జీఎం కార్యాలయం నుంచి గోలేటి గ్రామ బస్టాండు వరకు ఇరువైపులా కార్మిక వాడలతో పాటు ప్రజలు నివసిస్తున్నారు. తరుచూ వారు రోడ్డు దాటాల్సిన అవసరం కూడా ఉంటుంది.

ఈ దారిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఒక ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. విద్యార్థుల పాఠశాలతో పాటు వారి తల్లిదండ్రులు కూడా తరుచూ రోడ్డును దాటాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోకుండా లారీలను పరిమితికి మించిన వేగంతో నడుపుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పశువులను ఢీకొట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సదరు డ్రైవర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉంది. అంతేకాకుండా బొగ్గు లారీలపై నిబంధన ప్రకారం టార్పాలిన్ కవర్లను కప్పి బొగ్గు సరఫరాను చేయాల్సి ఉంటుంది. అయితే చాలా వరకు లారీలు టార్పాలిన్లు కప్పకుండానే బొగ్గును సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భాల్లో దుమ్ముధూళి ఇళ్లలోకి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనాలు అధిక స్పీడ్ ఉండటంతో కొన్ని సందర్భాల్లో లారీల నుంచి బొగ్గు కింద పడటం కూడా జరుగుతోంది. ఆయా సందర్భాల్లో లారీ వెనుకాల వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

సింగరేణి రోడ్డుకు ఇరువైపులా కాలనీతో పాటు ప్రజలు భగత్‌సింగ్‌నగర్, దుబ్బగూడ, రేగూలగూడ, రమణరెడ్డినగర్‌లు ఉన్నాయి. నిత్యం వాహనాలు వెళ్తున్న క్రమంలో దుమ్ముధూళి లేచి కార్మికుల ఇళ్లలో కి వస్తోంది. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు బొగ్గు ద్వారా వచ్చే దుమ్ముతో అనారోగ్యం బారిన పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. మూడు రోజుల ముచ్చటగా రోడ్డుపై కొద్ది రోజులు వాటర్ స్ప్రే చేసినప్పటికీ రెండు నెలలుగా వాటర్ స్ప్రే చేయటం నిలిపివేశారు. ప్రస్తుతం ఎండలకు దుమ్ముధూళి మరింతగా లేచి రోడ్డుకిరువైపులా ఇళ్లలోకి వస్తోంది.

దుమ్ము అధికంగా వస్తోంది..



లారీలు రోడ్డుపై వెళ్తున్న క్రమంలో దుమ్ముధూళి అధికంగా లేచి ఇళ్లలోకి వస్తోంది. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి అధికారులు స్పందించి రోడ్డు మీద దుమ్ము లేకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. **కె మల్లేష్, భగత్‌సింగ్‌నగర్**

పరిమిత వేగంతోనే నడపాలి..



జీఎం కార్యాలయం నుంచి గోలేటి విలేజీ వరకు రోడ్డు ప్రజలతో, వాహనదారులతో ఎప్పుడు రద్దీగానే ఉంటుంది. ఈ ప్రాంతంలో లారీలు పరిమిత వేగంతోనే ప్రయాణించాలి. లేనిపక్షంలో ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. **బి సాయి, గోలేటి టౌన్ షిప్**

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, విద్యుత్, వెలుతురు, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. అత్యవసర సేవలను వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, విద్యార్థులు పరీక్షా కేంద్రాల కు సకాలంలో చేరుకునేందుకు బస్సులు నడిపిసున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించాలని సూచిం చా రు. ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

దివ్యాంగులకు యూనిక్ డిసేబులిటీ ఐడీ

ఆసిఫాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రస్తుతం అందిస్తున్న సదరం సర్టిఫికేట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం యూనిక్ డిసేబులిటీ ఐడీ (యూడీఐడీ) అందుబాటులో తీసుకువచ్చిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా పరిషత్, జిల్లా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు యూనిక్ డిసేబులిటీ ఐడీ ఇస్తుందని ఇప్పటివరకు ఏడు కేటగిరీల్లో సదరం సర్టిఫికేట్ అందిస్తుండగా ఇకనుంచి 21 కేటగిరీల్లో సంబంధించి యూనిక్ డిసేబులిటి ఐడీ కార్డులు ఇస్తామని తెలిపారు. ఈ సేవలను వినియోగానికి మార్చి 1 తేదీ నుంచి అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలో ప్రతీ దివ్యాంగుడు కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని, సదరం సర్టిఫికేట్ కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని సదరంలో తెలిపిన చిరునామాకు కార్డులు స్పీడ్ పోస్టు ద్వారా పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాటిల్ మూత మింగి బాలుడి మృతి



రుద్ర అయాన్ (ఫైల్)

లక్షెట్టిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ఊత్కూర్‌కు చెందిన రుద్ర అయాన్ అనే 9నెలల బాలుడు కూల్ డ్రింక్ మూత మింగి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం గడికొప్పుల సురేందర్ సుప్రియ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. సుప్రియ తల్లిగారి ఊరైన లక్షెట్టిపేట మండలం కొమ్ముగూడెం గ్రామంలో ఆదివారం ఓ శుభకార్యానికి హాజరయ్యారు. అందరూ పనిలో ఉండగా రుద్ర అయాన్ కూల్‌డ్రింక్ మూత మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి మృతితో కుటుంబసభ్యుల రోదనలు చూపరులను కంట తడిపెట్టించాయి. తండ్రి ఫిర్యాదుమేరకు ఎస్సై సతీష్ కేసుదర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

గోడ కూలి ఒకరి మృతి

రెబ్బెన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం నవేగాంలో సోమవారం గోడ కూలి లస్మయ్య(59) అనే వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటికి కూలి పనిచేయటానికి లస్మయ్య ఉదయం వెళ్లాడు. పనిచేస్తున్న క్రమంలో ఇంటి గోడ ఒక్కసారిగా కూలి లస్మయ్యపై పడింది. వెంటనే తోటి కూలీలు స్పందించి కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు ఎస్సై పేర్కొన్నారు. లస్మయ్య సోదరుడు రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి

మంచిర్యాల క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హమాలీవాడకు చెందిన శివాజీగ్రౌండ్‌లో ఆదివారం రాత్రి ఎర్రగుంటపల్లి సంపత్ అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మందమర్రికి చెందిన ఎర్రగుంటపల్లి సంపత్ కొంతకాలంగా మంచిర్యాలలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై మంచిర్యాల ఎస్‌హెచ్‌ఓ ప్రమోద్‌రావును వివరణ కోరగా, దాడి జరగడం వాస్తవమేనని, ఇతనిపై గతంలో కొన్ని కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. దాడికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని పేర్కొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

గర్మిళ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్వచ్చంద సేవా సంస్థల ప్రతినిధి లయన్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సినిమావాడలోని లయన్స్ దత్తత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్, కార్యదర్శి చంద్రమౌళి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్‌రెడ్డి, వినయ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, డేగ బాపు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డ నిందితుల పట్టివేత



పట్టుకున్న నిందితులతో పోలీసులు

తాండూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గోలేటి వర్కుషాపులో దొంగతనం చేసిన నిందితులను పట్టుకున్నట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి వర్కుషాపులో విలువైన ఇత్తడి వస్తువులు దొంగతనం జరిగినట్లు గుర్తించిన ఎస్అండ్‌పీసీ అధికారులు ఫిబ్రవరి 18న మాదారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తాండూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి నయారా పెట్రోలు బంకు ముందు మాదారం ఎస్ఐ సౌజన్యతో కలిసి తనిఖీలు చేస్తుండగా బ్రాస్ ఐటమ్స్‌ను రెండు పాత వాహనాలపై అనుమానస్పదంగా తీసుకుని వెళ్తున్న నలుగురి పట్టుకుని విచారించామన్నారు. దీంతో వారు గోలేటి వర్కుషాపులో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి రూ. 6.20 లక్షల గల బ్రాస్ ఐటమ్స్‌ను స్వాధీన పర్చుకున్నామన్నారు. దొంగతనం చేసిన మందమర్రికి చెందిన మోతె రాజయ్య, మోతె నర్సయ్య, పస్తం మధు, మోతె తిరుపతిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు

కాగజ్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో హోలీ పండుగ ముందస్తు వేడుకలను మార్వాడి మనోహక మండలి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ కార్యక్రమాలను నిర్వహించి అనంతరం పట్టణం లోని వీధుల గుండా హోలీ పాటలు పాడు తూ సంబరాలు జరిపారు. కార్యక్రమంలో పట్టణ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు ప్రకటించడం హర్షణీయం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు ప్రకటించడం హర్షణీయమని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. గతంలో తాము సీఎంకు, ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు, మంత్రుల దృష్టికి తీసుకుపోవడమే కాకుండా వినతులు సమర్పించామన్నారు. తమ వినతులకు స్పందించి పేరు పెట్టడం హర్షనీయమన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

- వృద్ధురాలి మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గన్నేరువరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి ఓవర్ స్పీడుతో వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న వృద్ధురాలు బొంగాని రాజమ్మ(88) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బొంగాని రాజమ్మకు బొంగాని మొగిలయ్య, బొంగాని మల్లయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు తన తల్లిని వంతులవారీగా చూసుకుంటున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పెద్దకొడుకు మొగిలయ్య మందమర్రిలో తన తమ్ముడి వద్ద తల్లిని తీసుకరావడానికి తన కొడుకు అనిల్‌కుమార్‌ను మందమర్రికి పంపించాడు. ఆదివారం మందమర్రి నుంచి నానమ్మ రాజమ్మను ఏపీ 11ఏపీ 0960 నంబర్ గల కారులో ఎక్కించుకొని అనిల్‌కుమార్ హైదరాబాద్ బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్దకు రాగానే ఓవర్‌స్పీడు వల్ల వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌కు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న రాజమ్మకు తీవ్రగాయాలు కాగా మనవడు అనిల్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అనిల్‌కుమార్ స్థానికుల సహాయంతో రాజమ్మను కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. మృతురాలు రాజమ్మ మనవడు బొంగాని అనిల్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాధాకిషన్ తెలిపారు.

నిర్వాసిత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బెల్లంపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి నిర్వాసిత గ్రామాలైన బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, ఆకెనపల్లి, లింగాపూర్, తాళ్లగురిజాల గ్రామాల్లో రెండోసారి శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి చేశారు. ఈ నెల 6న బెల్లంపల్లిలోని శాంతిఖని గని ఆవరణలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో నిర్వాసిత గ్రామరైతులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించకుండా పోలీసులు, సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో అడ్డుకున్నారన్నారు. మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సింగతి కిరణ్‌కుమార్, కందుల రాకేష్‌కుమార్, శంకర్, గోమాసశ్రీనివాస్, తొంగల మల్లేష్, సింగతి నరేందర్, వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

రెబ్బెన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో రెబ్బెన మండలం నంబాల హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు కరాటే మాస్టర్ చాపిడి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ కేటగిరి విభాగంలో డి ప్రణిత గోల్డ్ మెడల్, ఆర్ సోను సిల్వర్ మెడల్, ఐ హరిత బ్రాంజ్‌మెడల్ సాధించినట్టు ఆయన వివరించారు.

ఐకే1ఏ గనిలో కార్మికుడి మృతి

- గని ప్రమాదంగా గుర్తించి ఆదుకోవాలని కార్మిక సంఘాల డిమాండ్

జైపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం 1ఏ గని బొగ్గు గనిలో విధులు నిర్వహిస్తూ సింగరేణి జనరల్ మజ్దూర్ కార్మికుడు పచ్చునూరి రాంచందర్ (32) సోమవారం మృతి చెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం కార్మికుడు రాంచందర్ యాక్టింగ్ మ్యాన్ రైడింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం మొదటి షిఫ్టు పనుల్లో భాగంగా గని భూగర్భంలోని మూడో డీప్, జీరో లెవెల్ వద్ద గల రెండో మ్యాన్‌రైడింగ్ (కార్మికులు గనిలోని పని స్థలాలకు వెళ్లి రావడానికి వినియోగించే యంత్రం) ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా మ్యాన్ రైడింగ్ స్టేషన్‌లోనే రాంచందర్ కుప్పకూలి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు, అధికారులు ఆర్కే 8 డిస్పెన్సరీకి, అక్కడ నుంచి రామకృష్ణపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రాంచందర్ మృతిచెందాడని తెలిపారు. మృతుడు పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన వాడని, ఇంకా వివాహం కాలేదని పేర్కొన్నారు. రామకృష్ణపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఉన్న రాంచందర్ మృతదేహాన్ని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, ఇందారం 1ఏ గని ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబీకులను ఓదార్చారు.

- రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



రాంచందర్ మృతిని గని ప్రమాదంగా గుర్తించాలని ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్ యూనియన్‌ల నాయకులు డిమాండ్ చేశారు. కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు మృతుని కుటుంబంలో ఒకరికి డిపెండెంట్ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

● గని ప్రమాదంగా గుర్తించాలి

శ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): ఇందారం 1ఏ గని కార్మికుడు పచ్చునూరి రాంచందర్ మృతిని గని ప్రమాదంగా గుర్తించాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారప సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానికంగా మాట్లాడారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చనిపోయిన రాంచందర్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వారు కోరారు.

● న్యాయం చేయాలి

శ్రీరాంపూర్: ఇందారం 1ఏ గనిలో మరణించిన పచ్చునూరి రాంచందర్ మృతిని గని ప్రమాదంగా గుర్తించి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ డిమాండ్ చేశారు. రాంచందర్ మృతి వార్త తెలుసుకున్న ఆయన వెంటనే రామ్మకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కోట్ల రూపాయల లాభాలు అర్జిస్తున్న సింగరేణిలో కార్మికులు గనిలో అ స్వస్థతకు గురైతే వైద్యం అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు అలు వాల సంజీవ్, ఆర్కే 7 పిట్ కార్యదర్శి శ్రీధర్ ఉన్నారు.

కార్మికుడి కుటుంబానికి పరామర్శ

పచ్చునూరి రాంచందర్ మృతికి టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ సంతాపం తెలిపారు. రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆస్పత్రిలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అధికారులతో మాట్లాడి గని ప్రమాదంగా గుర్తించి బెనిఫిట్స్ అందేలా చూస్తామని తెలిపారు. లక్ష్మణ్ వెంట యూనియన్ నాయకులు గొర్ల సంతోష్, తొంగల రమేష్, బీఆర్ఎస్ నాయకుడు రఫీక్ ఖాన్, తదితరులు ఉన్నారు.

న్యూటెక్ గని జీవితకాలం పెంచేందుకు కృషి

శ్రీరాంపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): న్యూటెక్ గని జీవితకాలం పెంచేందుకు కృషి చేస్తున్నటు శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం లక్ష్యం సాధించిన సందర్భంగా సోమవారం గనిపై ఉద్యోగులకు ఆయన బహుమతులు అందించారు. మూడేళ్లుగా గని 100 శాతం ఉత్పత్తి సాధించడం అభినందనీయమన్నారు. ఎస్‌డీఎల్ ద్వారా ఉత్పాదకతలో గని మొదటి స్థానంలో ఉందన్నారు. గని జీవితకాలం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఉత్పత్తి, రక్షణలో న్యూటెక్ గని ఉద్యోగులు ఆదర్శనీయులన్నారు. నూతన ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావద్దని కోరారు. అనంతరం జీఎం శ్రీనివాస్‌తో పాటు ఆర్కే 7 గ్రూపు ఏజెంట్‌గా పనిచేస్తూ ఏజీఎంగా పదోన్నతి పొందిన రాజేందర్‌ను గని మేనేజర్ స్వామిరాజు, ఇతర ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, గ్రూపు ఇంజనీర్ రవిచరణ్, గని రక్షణాధికారి కొట్టె రమేష్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, సంక్షేమాధికారి సృజన్ పాల్, తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్



ఉత్పత్తి లక్ష్యాల దిశగా కృషి చేయాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి



ఖైరిగూడలో కార్మికులను అభినందిస్తున్న జీఎం విజయభాస్కర్ రెడ్డి

రెబ్బెన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):ఉత్పత్తి లక్ష్యాల దిశగా ఉద్యోగులందరూ కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి సూచించారు. ఖైరిగూడ ఓపెన్‌కాస్టును సోమవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యాల దిశగా ప్రతి ఉద్యోగి తన వంతు కృషి చేయాలన్నారు. అలాగే ఫిబ్రవరి 135 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినందులకు అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి 37.5 లక్ష టన్నులు బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి ఇంకా 21 రోజులు మిగిలి ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీవో మచ్చగిరి నరేందర్, ఎఐటీయూసీ వైస్ ప్రసిడెంట్ బయ్య మొగిలి, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, సేఫ్టీ అధికారి ఎ.నారాయణ, గణి మేనేజర్ శంకర్, డిప్యూటీ పీఎం వేణు, ఎఐటీయూసీ నాయకులు శేషు, దివాకర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వర్కర్ మృతికి సంతాపం

రెబ్బెన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీఎం కార్యాలయంలోని ఐటీ విభాగంలో బదిలీ వర్కర్‌గా పని చేస్తున్న రూబీన తారన్నం ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ఆరోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ బదిలీ వర్కర్ మృతి చెందటం బాధకరమైన విషయమన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలనారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐటీ డిపార్టుమెంటు హెచ్ఓడి ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.



- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- బహుళ ప్రయోజనకారిగా గుర్తింపు
- ఆసక్తి చూపుతున్న రైతులు
- ఈజీఎస్ పథకం కింద రైతులకు సహాయం

అజోలా సాగు.. భలే బాగు

జిల్లాకు 81 యూనిట్లు...

ప్రభుత్వం జిల్లాకు అజోలా సాగు కోసం 81 యూనిట్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ జాబ్‌కార్డులున్న రైతులు వీటిని ఏర్పాటు చేసుకున్నాక నేరుగా వారి ఖాతాల్లో ఆ డబ్బులు జమ అవుతాయి. జిల్లాలో 81 యూనిట్లు మంజూరు కాగా 12 బోర్లు రీచార్జ్ పూర్తి చేసుకున్నాయి. ఇప్పటికి చెన్నూరు మండలంలో ఏడు, బెల్లంపల్లిలో 1, దండేపల్లికి 14, జన్నారానికి 16, కన్నెపల్లి మండలానికి 12, కోటపల్లి మండలానికి 18, నెన్నెల మండలానికి 3, తాండూర్ మండానికి 2, లక్షెట్టిపేట మండలానికి 2, వేమనపల్లి మండలానికి 6 మొత్తం 81 యూనిట్లు మంజూరయ్యాయి.



అజోలా మొక్కలు

చెన్నూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండడంతో రైతులు అజోలా సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈజీఎస్ పథకం ద్వారా ఆర్థిక సహాయం కూడా అందిస్తుండడంతో రైతులు ఈ పంటపై మొగ్గు చూపుతున్నారు. మంచిర్యాల జిల్లాకు 81 యూనిట్‌లు మంజూరయ్యాయి. అజోలా సాగుతో అనేక లాభాలు ఉన్నాయి. నాటు జాతికి చెందిన ఇవి బహుళ ప్రయోజనకారిగా గుర్తింపు పొందాయి. వర్షం నీటిని ఒడిసి పట్టేందుకు నీరు వృథా కాకుండా ఉండేందుకు భూ గర్భ జలాల పెంపునకు ఇది తోడ్పడుతుంది. సేంద్రియ సాగుకు ఉపయోగించడంతో పాటు చేపలు, కోళ్లకు, పశువులకు మంచి పోషకాహారంగా దీనిని అందించవచ్చు.



రైతును అభినందిస్తున్న అధికారులు

వరిపంటకు ప్రయోజనకారి...

అజోలా వాతావరణంలోని నత్రజనిని వేళ్ల ద్వారా నేలలో స్వీకరిస్తుంది. పొలంలో వరి నాటు వేశాక వారం రోజులకు అజోలాను వేస్తే కలుపు మొక్కలు పెరగకుండా అరికడుతుంది. ఇది యూరియా ఎరువుతో సమానంగా పని చేస్తుంది. వరి నాటు వేసిన 15 రోజుల్లో ఎకరానికి 20 గ్రాముల నుంచి 40 గ్రాముల వరకు అజోలాను తీసుకుని పంటలో అక్కడక్కడ నీటిలో చల్లుకోవాలి. వరి పంటలో నీటిపై చల్లిన అజోలా 15 రోజుల నుంచి 20 రోజుల్లో వృద్ధి చెందుతుంది. వరి పంటలో హెక్టారుకు 50 కిలోల నత్రజనిని పంట కాలంలో స్వీకరిస్తుంది. ఒక హెక్టారుకు 30 కిలోల నత్రజ నిని తగ్గించుకోవచ్చు. అజోలా వాడకం ద్వారా 20 శాతం తక్కువ పెట్టుబడితో 20 శాతం అధికంగా పంట దిగుబడి పొందవచ్చు. వరి పొలాల్లో నాచులాగా నీటి ఉపరితలం పై కార్పెట్ లాగా పర్చు కోవడం వల్ల నీరు ఆవిరి కాకుండా నీటి మట్టాన్ని తగ్గకుండా ఇది పనిచేస్తుంది.

పశుగ్రాసంగా ఉపయోగించవచ్చు

అజోలా పశువులకు మేతగా ఉపయోగపడుతుంది. ఇందులో 20 శాతం ప్రొటీన్‌లు, 10 నుంచి 15 శాతం మినరల్స్, 10 నుంచి 20 శాతం అమైనా యాసిడ్స్‌ను పశువులకు అందిస్తుంది. పశువులకు మేతగా అజోలాను వేస్తే పాల ఉత్పత్తి 15 నుంచి 20 శాతం వరకు పెరుగుతుంది. పశువులను ఆరోగ్యంగా ఉంచి పాలలో వెన్న శాతం పెరిగేలా చూస్తుంది. పచ్చి అజోలా చేపలు, కోళ్లు, మేకలకు కూడా ఆహారంగా అందించవచ్చు. ఎండిపోయిన అజోలాను పశువుల దాణాగా ఉపయోగించవచ్చు. రైతులు అజోలాను విక్రయించి కూడా ఆదాయం పొందవచ్చు.

సాగు విధానం ఇలా..

అజోలా పెంపకానికి 10 నుంచి 15 సెంటీమీటర్ల లోతు స్వచ్ఛమైన నీటి తొట్టి అవసరం. 10 గ్రాములు, లేదా 20 గ్రాముల అజోలాను నీటి తొట్టిలో వేసి నీడ కింద ఉంచాలి. దీంతో 15 రోజుల్లో అబివృద్ధి చెందిన అజోలా తొట్టి మొత్తం కార్పెట్‌లాగా నీటిపై పరుచుకుపోతుంది.

మండలంలో నాలుగు యూనిట్లు పూర్తి



చెన్నూరు మండలానికి ప్రభుత్వం నుంచి 7 అ జోలా యూనిట్‌లు మంజూరయ్యాయి. ఇందులో నాలుగు యూనిట్లు పూర్తయ్యాయి. ఇంకా 3 యూనిట్ల పనులు కొనసాగుతు న్నాయి. మండలంలోని లంబడిపల్లిలో 2, అక్కెపల్లిలో 1, కత్తెరసాలలో 1 పూర్తి అయ్యింది. అజోలా సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలి. **-గంగాభవానీ, ఈజీఎస్ ఏపీవో**

లాభాలు బాగున్నాయి..



నాకున్న నాలుగు ఎకరాల మామిడితోటలో ఉన్న బోరు బావిని రీచార్జ్ చేయించాను. తోటలో మూడు నీటి తొట్లు నిర్మించుకున్నాను. ప్రభుత్వం ఇందుకు గాను రూ. 58 వేల సహాయం అందించింది. రూ. 400లకు కిలో చొప్పున అజోలా గింజలను కొనుగోలు చేసి సాగు చేస్తున్నాను. పంట ఆశాజనకంగా ఉంది. రైతులు దీనిని సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

- మద్ద మధు, రైతు, లంబడిపల్లి

ఒడిశా టూ మంచిర్యాల..

(5వ పేజీ తరువాయి)

తీసుకున్న ముఠా సభ్యులు కారులో మంచిర్యాలకు తీసుకువచ్చారు. ఆ గంజాయిని ప్రవీణ్ సీసీ కెమెరాల గోదాంలో దాచి ఉంచారు. అందులో నుంచి కొందరు సుమారు 20 కిలోల మేర అమ్మకం కోసం తీసుకెళ్లగా పోలీసులకు సమాచారం అందించింది. దీంతో గోదాంపై దాడిచేసి అక్కడ ఉన్న గంజాయిని పట్టుకున్నారు.

● పదుల సంఖ్యలో అడ్డాలు...

జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంత పట్టణాలు, గ్రామాల్లో వందల సంఖ్యలో గంజాయి అడ్డాలు ఉ న్నాయి. జిల్లా కేంద్రంలోని హమాలివాడ అశోక్ రోడ్డులోనూ విరివిగా గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక పోచమ్మ చెరువు సమీపంలో యువత గంజాయి సేవిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక కాలేజీ రోడ్డులోనూ గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. గోదావరి ఒడ్డున నిత్యం గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్న యువత అక్కడి నిర్మానుష్య ప్రాంతాల్లో సేవిస్తున్నట్లు తెలుస్తోంది. చెన్నూరులోనూ గంజాయి వినియోగం అధికంగానే ఉంది. అప్పటి చెన్నూరు సీఐ ప్రమోద్‌రావు కొందరు గంజాయి సేవకులకు కౌన్సెలింగ్ నిర్వహించడమే దీనికి నిదర్శనం.

● విస్తరిస్తున్న హెరాయిన్ వినియోగం...

గంజాయితోపాటు అత్యంత ప్రమాదకరమైన మత్తు పదార్థం కూడా జిల్లాలో విరివిగా లభ్యం అవుతోంది. మంచిర్యాల పట్టణ కేంద్రంగా హెరాయిన్, ఇతర మత్తు పదార్థాల సరఫరా జోరుగా సాగుతోంది. మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతం నుంచి హెరాయిన్‌ను దిగుమతి చేసుకుంటూ జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో యువతకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం..

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



గంజాయి విక్రయాలను నియంత్రించేందుకు మంచిర్యాల డివిజన్ పరిధిలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాము. ఆ బృందాలు గంజాయి విక్రయాలు, వినియోగంపై దృష్టిసారిస్తారు. ఎక్కడి కక్కడే గంజాయి విక్రయాలను అడ్డుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. యువత గంజాయికి బానిస అయి జీవితాలను నాశనం చేసు కోకూడదు. గంజాయి విక్రయించినా, సేవించినా అది చట్ట రీత్యా నేరం. అందులో ఎంతటివారున్నా వదిలి పెట్టే ప్రసక్తే లేదు. తల్లిదండ్రులు కూడా యువత కదలి కలపై దృష్టిసారిస్తే మంచిది.

వైభవంగా మల్లన్నస్వామి పట్నాలు

దండేపల్లి,మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో కొమరవెల్లి మల్లన్న స్వామి ఆలయంలో బోనాల, పట్నాల వేడుకలు అంగరంగ వైభోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద పూజరులు ప్రత్యేక పూజల నడుమ పట్నాలు పర్చారు. అనంతరం కొమరవెల్లి మల్లన్న స్వామిని కొలుస్తూ ప్రత్యేక పూజలతో స్వామికి బోనాలు సమర్పించారు. వందలాది మంది భక్తులు బోనాల జాతరకు తరలివచ్చి మల్లన్నస్వామిని ప్రత్యేక పూజలతో దర్శించుకోని మొక్కులు చెల్లించుకున్నారు.

బెల్లంపల్లి ప్రీమియర్ లీగ్ విజేత సన్నిబాబు క్యాపిటల్స్



బహుమతితో క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్టు

బెల్లంపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి పట్టణంలో ఎంసీ మైదానంలో 15 రోజులుగా హరీష్ మెమోరియల్ క్రికెట్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బెల్లంపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. టోర్నమెంట్‌లో విజేతగా సన్నిబాబు క్యాపిటల్స్ జట్టు నిలిచింది. రన్నర్‌గా బూడిదగడ్డ బ్లాస్టర్స్ జట్టు నిలిచింది. విజేత జట్టుకు అంజనిపుత్ర ఎస్టేట్స్ అండ్ ప్రైవేటు లిమిటెడ్ తరుపున చైర్మన్ గుర్రాల శ్రీధర్ లక్ష రూపాయలు అందజేయగా, రన్నర్ జట్టుకు డాక్టర్ శ్రీపతి గోపతి, మల్లికార్జున హాస్పిటల్ తరుపున రూ. 50 వేలను అందజేశారు. అంజనిపుత్ర ఎస్టేట్స్ డైరెక్టర్ పిల్లి రవి, కారుకూరి రాంచందర్, టోర్నమెంట్ నిర్వహకులు నల్లవెల్లి అనీష్, లింగంపల్లి శివ, సాయికృష్ణ, టోర్నమెంట్ ఫ్రాంచైజ్ ఓనర్స్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కోటపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పెద్దపల్లిలో జరిగిన అండర్ 14 కుంగ్‌ఫూ అండ్ కరాటే పోటీల్లో కోటపల్లి పీఎంశ్రీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్, కరాటే మాస్టర్ పట్టెం తిరుపతి తెలిపారు. బాలికల కటాస్ విభాగంలో 6వ తరగతికి చెందిన ఇస్లావత్ అంజలి, 7వ తరగతికి చెందిన ఎం. అంజలి బంగారు పతకాలు సాధించగా, 6వ తరగ తికి చెందిన రిషిత, రాగం హర్షిణి, నిత్యశ్రీ, 7వ తరగతికి చెందిన వర లక్ష్మీ, 8వ తరగతికి చెందిన సరితలు వెండి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యార్థులను సోమవారం పాఠశాలలో ప్రిన్సిపల్, కరాటే మాస్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బెల్లంపల్లి : ఈ నెల 9న పెద్దపల్లిలో జరిగిన ఫస్ట్ నేషనల్ లెవెల్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని లోటస్ పాఠశాలకు చెందిన విద్యార్థి కూడికల రోషన్‌సాయి స్పారింగ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. సోమవారం విద్యార్థిని ప్రిన్సిపల్ బగ్గ నిశేషకుమార్, ఉపాధ్యాయులు కల్పన,మహేష్, తైక్వాండో ప్రెసిడెంట్ చిరంజీవి, జనరల్ సెక్రటరీ రా జేష్‌లు అభినందించారు.

గదులను అందుబాటులోకి తేవాలి

మందమర్రిరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న హ్యాపీ హోమ్, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని బహుజన సమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల రాజేంద్రప్రసాద్ కోరారు. సోమవారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. పట్టణాధ్యక్షుడు శంకర్, మండల అధ్యక్షుడు మతీ న్‌ఖాన్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌లో గిరిజన యువతికి బంగారు పతకాలు

నెన్నెల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్వాయిపేట గ్రామానికి చెందిన గిరిజన యువతి కున్సోత్ స్నేహ సైక్లింగ్‌లో రాష్ట్ర స్థాయిలో సత్తాచాటింది. తెలంగాణ సైక్లింగ్ అసోసియేన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోహెడలో ఈ నెల 7 నుంచి 10 వరకు నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి బైక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు బంగారు పతకాలు సాధించింది. స్నేహను తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి భూలోకం విజయకాంతారావు, ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు మల్లారెడ్డి, వెంకటనర్సయ్య, కోచ్ సంజీవ్, పీటీ హారిక అభినందించారు. ఆసిఫాబాద్‌లో డిగ్రీ చదువుతున్న స్నేహ గతంలో రాష్ట్ర స్థాయి సీఎం కప్పులో రెండు సార్లు, జార్ఖండ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించింది.

చెన్నూరు పట్టణ సీఐ బదిలీ

చెన్నూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న కట్ల రవీందర్ సోమవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైద్రాబాద్ ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న దేవేందర్‌రావు ఇక్కడకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రూప్-1 ఫలితాల్లో ప్రతిభ

నస్పూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 ఫలితాల్లో సింగరేణి ఉ ద్యోగి కుమారుడు ఉత్తమ ఫలితం సాధించాడు. సీసీసీలోని నాగార్జున కాలనీకి చెందిన రిక్కుల చంద్రారెడ్డి-అంజలిల కుమారుడు సత్యనారాయణరెడ్డి సోమవారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 420 మార్కులు సాధించాడు. ఆయన కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టుమన్‌పై ఎంపీడీవో ఆగ్రహం

తాండూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులకు పింఛన్ సక్రమంగా పంపిణీ ఎందుకు చేయడం లేదని పోస్టుమన్‌పై ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పనులను పరిశీలిస్తుండగా పోస్టుమన్ ఇంటి వద్ద పలువురు గుమిగూడి ఉండడం చూసి అక్కడకు వెళ్లి ఇక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. తమకు పింఛన్ ఇస్తానని చెప్పి పోస్టుమెన్ చెప్పడంతో ఉదయం 9 గంటల నుంచి ఇక్కడే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీవో పోస్టాఫీసుకు వెళ్లి పోస్టుమెన్ ఫారుక్‌ను నిలదీశారు. పింఛన్ సకాలంలో అందించాలని పేర్కొన్నారు. ఇక ముందు ఇలాంటివి జరిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎంపీడీవో హెచ్చరించారు.

ఓపెన్ జిమ్ పరిశీలించిన కమిషనర్



జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్

మందమర్రిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలోని ఓపెన్ జిమ్ పరికరాలను సోమవారం మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు పరిశీలించారు. పరికరాలు పాడైపోయి ఉండగా వాటిని పరిశీలించి మరమ్మతులు చేయించాలని డీఈ సుమతిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు 'తెర'ణోపాయం

ఎండాకాలంలో గ్రీన్ షామియానాల ఏర్పాటు



నర్సరీలో మొక్కలకు ఏర్పాటు చేసిన షామియానాలు

దండేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రారంభం కావడంతో ఉదయం చల్లగా, 10 తర్వాత ఎండలు మండిపోతున్నాయి ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారం గ్రామ నర్సరీ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కల పెంపకం కోసం నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. మొక్కల పెంచుతున్న నిర్వాహకులకు మండటెండలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవైపు ఉన్నత అధికారులు నర్సరీలో పెంచే మొక్కలు ఎండిపోకుండా చూడాలని పదేపదే చెబుతున్నారు. దీంతో పచ్చని షామియానాలతో చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సంరక్షణ చర్యలు తీసుకుంటోంది. మండలంలోని జీపీలలో ఏర్పాటు చేసిన నర్సరీలో ఎక్కడ చూసిన ఈ చలువ పందిళ్లే దర్శమిస్తున్నాయి. మొక్కలకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని పచుతున్నాయి.

సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడవాలి



మహిళలకు అవార్డులు ప్రదానం చేస్తున్న సభ్యులు

మందమర్రి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని డా. ఊదరి చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో టాలెంట్ కల్చర్ ఆర్ట్స్ సమష్టి చేయూత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు నారీ శక్తి పురస్కారాలకు హాజరై మాట్లాడారు. పలువురు మహిళలకు అవార్డులు అందజేశారు. సంస్థ నిర్వాహకులు సునర్కర్ రాంబాబు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.

కాసిపేట : సావిత్రిబాయిపూలే వర్ధంతిని సోమవారం దేవాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. నాయక పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు రాజం, యశ్వంత్, పోచన్న, రజిత, అర్చన, లక్ష్మీ, ఉపాధ్యాయురాలు నవీన, సంజీవ్, మహేష్ పాల్గొన్నారు.

గర్మిళ్ల : బీసీ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుతోట పద్మావతి మాట్లాడారు. నాయకురాల్లు నాగల క్ష్మీ, జ్యోతి, సంగీత, సాంబలక్ష్మీ, సారిక, రజిని, పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని మోదెలలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని సోమవారం సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు తొగరి రాజు, మోదెల అధ్యక్షుడు దుర్గాంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.



దేవాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

బెల్లంపల్లి : దేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని పూలె పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక నాయకులు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న యాదవ సంఘం నాయకులు

భీమారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీమల్లికార్జున స్వామి దేవాలయానికి సోమవారం కుల సంఘం అధ్యక్షుడు కిష్టయ్య, నాయకులు దంపతులతో కలిసి భూమి పూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భూమి పూజను ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

జన్నారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలోని దేవునిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగడ్డంగూడ గ్రామంలో ఉన్న గిరిజనుల ఇళ్లను కూల్చి వేసిన అటవీశాఖ అధికారులను అరెస్టు చేసి శిక్షించాలని హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, నిజనిర్ధారణ బృందం సభ్యుడు ఆత్రం భుజంగరావు డిమాండ్ చేశారు. సోమవారం గిరిజన గ్రామానికి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 150 మంది అటవీశాఖ అధికారులు దాడి చేయడం చట్ట ఉల్లంఘన అవుతుందన్నారు. 30 ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్న వారిని అన్యాయంగా రాత్రి సమయంలో జేసీబీ ట్రాక్టర్‌లతో కూలగొట్టడం సరైంది కాదన్నారు. 30 సంవత్సరాల్లో లేని అవీ ఆంక్షలు ఇప్పు డెలా వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి గుడిసెలను పూర్తిగా జేసీబీ ట్రాక్టర్‌లతో తొలగించడంతో పాటు వారిని అటవీ శాఖ అధికారులు నానా బూతులు తిట్టడంతో జీర్ణించుకోలేని రాథోడ్ బలిరాం పురుగుల మందు తాగాడన్నారు. గిరిజనులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అటవీ సిబ్బందిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పం దించి వెంటనే గిరిజనులకు న్యాయం చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో నిజ నిర్ధారణ బృందం సభ్యులు రఘోత్తంరెడ్డి, అమృత్‌రావు, కార్యకర్తలుమేడ మురళీ, ప్రకాష్, బాగ్యరావు, రవి పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, నిజ నిర్ధారణ బృందం సభ్యులు

సంక్షిప్త సమాచారం

కోటపల్లి : మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం వ్యవసాయశాఖ ఏడీఏ ప్రసాద్ వరి పంట క్షేత్రాలను పరిశీలించారు. వరిలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఉన్నట్లు పేర్కొన్నారు.

కోటపల్లి: కోటపల్లి మండల తహసీల్దార్‌గా రాఘవేంద్రరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ మహేంద్రనాథ్ మంచిర్యాల కలెక్టరేట్‌లోని ప్రోటోకాల్ విభాగానికి బదిలీ కాగా అక్కడ విధులు నిర్వహించిన రాఘవేంద్రరావు బదిలీ పై కోటపల్లి తహసీల్దార్‌గా వచ్చారు.

తాండూర్: భూసమస్యలపై, శాంతి భద్రతలపై ప్రత్యేక ప్రజావాణిని రెండవ, నాలుగో సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్, మాదారం ఎస్ఐ సౌజన్య, ఆర్ఐ ఎజాజుద్దీన్‌లు ఫిర్యాదులు స్వీకరించారు.

వేమనపల్లి: భూసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. సోమవారం వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్ర మం నిర్వహించారు.

కన్నెపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్‌లు మాట్లాడుతూ రెండు భూసమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు.

మందమర్రిటౌన్ : పట్టణంలోని దీపక్ నగర్‌కు చెందిన వడ్లూరి శంకర్ అనారోగ్యంతో మృతిచెందగా యూత్ ఫర్ సొసైటి సభ్యులు సోమవారం నెలకు సరిపడ నిత్యవసర సరుకులు అందించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఆధార్ కేంద్రం సేవలను వినియోగించుకోండి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గుండి రోడ్డులో గల తపాలా శాఖ కార్యాలయంలో ఉన్న ఆధార్ సెంటర్ కేంద్రంలో వినియోగదారులు సేవలను వినియోగించుకోవాలని పోస్టుమార్టర్ యోగేష్ కుమార్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధార్ కేంద్రంలో ఆధార్‌లో పేర్లు, పుట్టిన తేదీ, చిరునామా, ఇతర సవరణలు చేసుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన దరఖాస్తులు..

- రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన మసాడె రాజేశ్వరి తన పట్టా భూమికి కొలతలు జరిపి హద్దులు నిర్ధారించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- తిర్యాణి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీలు తమకు ఎన్‌టీఆర్‌ఎస్ సాగర్ ప్రాజెక్టులో చేపలు పెంచడానికి అవకాశం కల్పించాలని కోరారు.
- బెజ్జూరు మండలం ముంజంప ల్లికి చెందిన శంకర్ తన పట్టాభూమి నిషేధిత జాబితాలో ఉందని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
- చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి గ్రామానికి చెందిన ఓంకార్ ది వ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని వినతిపత్రం అందజేశారు.
- బెజ్జూరు మండలం ముంజంప ల్లికి చెందిన లచ్చుంబాయి సాగుచేస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరారు.
- చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన గజానంద్ రైతు వేదికలో తాత్కాలిక వాచ్‌మెన్‌గా పనిచేసిన కాలానికి జీతం ఇప్పించాల ని కోరారు.
- కౌటాల మండల కేంద్రానికి చెం దిన శంకర్ తనకు సదరం శిబిరంలో దివ్యాంగుడిగా ధ్రువపత్రం జారీ చేయించాలని దరఖాస్తు అందజేశారు.
- వాంకిడి మండలం దాబా గ్రా మానికి చెందిన మురళీ మహేందర్ తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ పెట్టుకున్నారు.

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట రక్షణ చర్యలు

ఆసిఫాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం వద్ద పటిష్టమైన క్షణ చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటే ష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈవీఎం యం త్రాలకు పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతి నిధులు పాల్గొన్నారు.

ఎండలోనే 'ఉపాధి'పనులు

- పని ప్రదేశంలో కానరాని వసతులు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు



ఎండలో పనిచేస్తున్న కూలీలు

వాంకిడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇలాంటి తరుణంలో మట్టి పనులు చేయటం ఉపాధిహామీ కూలీలకు కష్టసాధ్యమే. పైగా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం ఉండటం లేదు. ఎవరకి వారే తాగునీటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యవసర ఔషధాల కిట్లు అందుబాటులో ఉండటంలేదు. కూలీలకు పనిప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ఆయా గ్రామపంచాయతీల పరిధిలో ఒక్కో కూలీకి రూ. 2.50 చొప్పున ప్రభుత్వం అందజేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 91,721 జాబ్ కార్డులు ఉండగా 1,70,268 మంది కూలీలు పనిచేస్తున్నారు.

● నిలిచిన అలవెన్స్‌లు..

ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు గతంలో ఫిబ్రవరి నుంచి మే వరకు కూలీలు చేసిన పనికి 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ప్రయాణ, కరవు భత్యం (టీఏ,డీఏ) ఖర్చు కింద గడ్డపారకు పది రూపాయలు, తట్టకు ఐదు రూపాయలు, మంచినీటికి ఐదు రూపాయలు, ఐదు కిలోమీర్లకు పైగా దూరం నుంచి వచ్చేవారికి 20 రూపాయల చొప్పున ఇవ్వాలి. వీటితో పాటు పనిప్రదేశంలో నీడ కల్పించి విశ్రాంతి తీసుకునేలా చూడాలి. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం వీటిని నిలిపివేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎదురయ్యే సమస్యలివి....

- ఎండలో ఎక్కువ సేపు పనిచేయటం వల్ల కూలీలకు వడదెబ్బ తగిలే ప్రమాదముంది.
- పని ప్రదేశాల్లో తాగునీరు సరిపడాలేకపోవడంవల్ల నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి.
- మధ్యాహ్నం పూట ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. నీడ సౌకర్యం లేకపోవటంతో కూలీలు శారీరకంగా బలహీనమవుతారు.
- ఎండల వల్ల చర్మ సమస్యలు, అలసట, తలనొప్పి వంటివి ఎదురవుతాయి.

● నిబంధనలు బేఖాతరు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అధికారులు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలి. కూలీలకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ కిట్లు, తాగునీరు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. కాని జిల్లాలో ఎక్కడా ఐదేళ్ల కాలంగా ఈ సౌకర్యాలు కల్పించడంలేదు. దీంతో ప్రతీ సంవత్సరం 44, 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత ల్లోను కూలీలు ఉపాధి పనులు చేస్తూ అవస్థలు పడాల్సి వస్తోంది. నీడ సౌకర్యం లేకపోవడంతో కూలీలు చెట్ల కిందనే సేదతీరుతున్నారు. గతంలో వేసవిలో కొందరు కూలీలు వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురైన, మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఉదయం 8 గంటలలోపే పనులకు వెళ్లే ఉపాధిహామీ కూలీలు మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు ముగించుకుని ఇంటికి వస్తుంటారు. కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తమతో పాటు సీసాల్లో నీరు తీసుకువెళ్తుంటారు. పనులకు ఉపయోగించే పలుగు, పార, మంచినీటికి రోజువారీ అలవెన్సులు చెల్లిస్తున్నామని చెబుతున్నా అవి కూడా సకాలంలో అందిన సందర్భాలు లేవు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు ఈసారైనా పనిప్రదేశాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు.

స్వీయ జాగ్రత్తలే కీలకం....

- ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలు తగినంత నీరు తాగాలి. శరీరం డీహైడ్రేషన్ కూడా చూసుకోవాలి.
- పని ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయనీళ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు పనిచేయటం మానుకోవాలి. ఉదయం, సాయంత్రం పనిచేయటం మంచిది.
- పనిమధ్యలో చిన్నచిన్న విరామాలు తీసుకోవాలి. శరీరం ఆటసిపోయినట్లు అనిపిస్తే విశ్రాంతి తీసుకోవాలి.
- తలనొప్పి, వాంతులు, అధిక చెమట వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుల సహాయం తీసుకోవాలి. బాధిత వ్యక్తిని నీడ ప్రదేశంలోకి చేర్చి నీటితో శరీరాన్ని తుడవాలి.
- ఉప్పు, చక్కెర కలిపిన ఆహారం లేదా పండ్లు తీసుకోవటం వల్ల శ రీరంలో శక్తి లవణాలు నిల్వ ఉంటాయి.

● నిరాశలో కూలీలు

2022లో ఉపాధిహామీ పనులు చేసే కూలీలకు కేంద్రం 12 రూపాయలు పెంచింది. 2023లో 15 రూపాయలు అదనంగా చెల్లించారు. గతేడాది 28 రూపాయలు పెంచగా కనీస వేతనం 300 రూపాయలకు చేరింది. అయినా కూలీలు నిరాశతో ఉన్నారు. గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలీతో పాటు వేసవి భత్యం చెల్లించేవారు. ఆ సమయంలో 15 నుంచి 30 శాతం వరకు అధికంగా ఉండేది. రెండేళ్ల నుంచి దీనిని తొలగించారు. పలుగు, పార భత్యాలు కూడా వారానికి ఒకసారి చెల్లించేవారు. దానిని కూడా ఆపివేశారు.

సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

- శ్రావణ్, ఏపీఎం, వాంకిడి



ఉపాధిహామీ పనులు చేసే కూలీలకు పనిప్రదేశంలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాము. 'సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ప్రభుత్వ వైద్యశాల నుంచి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఆయా పంచాయతీ ఆశా వర్కర్ల వద్ద అందుబాటులో ఉంచుతున్నాము. పనిప్రదేశంలో మంచినీరు, టెంట్ సౌకర్యాం కల్పించేందుకు చర్యలు తీ సుకుంటున్నాము. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి.

అందరూ కలిసికట్టుగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దహెగాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా ఉండాలని తహసీల్దార్ కవిత, ఎస్సై రాజులు అన్నారు. సోమవారం దహెగాం మండలం ఇట్యాల గ్రామాన్ని సందర్శించి వారు మాట్లాడారు. గ్రామంలో రెండు వర్గాలుగా విడి పోయి కుటుంబాలను బహిష్కరణ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా ఉంటే గ్రామాభివృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందే అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలో అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే సమాచారం అందించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్ఐ శృతి, కార్యదర్శి సాయి, తదితరులు ఉన్నారు.

డ్రాయింగ్ పరీక్ష ఫలితాల వెల్లడి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత జనవరిలో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) లోయర్ డ్రాయింగ్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని జడ్పీ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు తెలిపారు. డ్రాయింగ్ హయ్యర్ పరీక్ష పూర్తి చేసి ఉన్నత వృత్తి విద్యా కోర్సులకు, ఉద్యోగ అవకాశాలకు బాటలు వేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, మల్లికార్జున్, సంతోష్, సోనేరావు, విజేష్, రవీందర్, మారుతి, ప్రవీణ్, సంజయ్, రవిత, స్వప్న, సులోచన, భారతి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



నిరసన తెలుపున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రవికుమార్, జిల్లా కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ వార్ధ నదిపై ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కుమరం భీం ప్రాజెక్టు కాలువ నిర్మాణం పూర్తిచేయాలని, పూడిక తొలగించాలని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తి చేయాలని, వట్టివాగు, ఎర్రవాగు, ఎన్టీఆర్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా రైతులకు నీరందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినకర్, శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, కార్తీక్, రాజేందర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై చర్చించాలని కోరుతూ ఎమ్మెల్యే కోవలక్ష్మికి డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో యువజన రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, యూత్ డిక్లరేషన్ అమలుచేయాలని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, టీకానంద్, శ్రావణి పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి అధికారులే బాధ్యత వహించాలి

ఆసిఫాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని లలిత మరణానికి అధికారులే బాధ్యత వహించాలని పీఎస్‌యూ నాయకులు ఆనంద్‌రావు డిమాండ్ చేశారు విద్యార్థి మృతిపై జిల్లా సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరిపించాలన్నారు. విద్యార్థిని మృతి చెందిన వార్త విని వసతి గృహానికి వచ్చిన ఆమె తండ్రిని అక్కడ నుంచి గెంటి వేసిన సంఘటన అమానుషమన్నారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

పూలాజీ బాబా ధ్యానకేంద్రం వార్షికోత్సవం

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరియర్ మోవాడ గ్రామంలో పూలాజీ బాబా ధ్యాన కేంద్రం వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం అధ్యక్షుడు అరున్, పటేల్, బాదు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు భీంరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది: ఎస్పీ



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న ఎస్సై ఉల్లాస్

ఆసిఫాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. కెరమెరి పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జాదవ్ ఉల్లాస్ ఎస్సైగా పదోన్నతి పొందడంతో సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావును జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. పదోన్నతి పొందిన ఉల్లాస్‌కు స్టార్‌లను ఎస్పీ అలంకరించి ఈ సందర్భంగా మాట్లాడారు. ఉద్యోగ జీవితంలో పదోన్నతి ఎంతో ఉత్సాహానిస్తుందని, దాంతో పాటు బాధ్యతను కూడా పెంచుతుందని ఎస్పీ తెలిపారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కెరమెరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పదో తరతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏటీడీవో శ్రీనివాసరావు అన్నారు. హట్టి, బాబేఝరి, జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎంలు పంచపులబాయి, మోతిరాం, జంగులు ఉన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి సన్మానం

రెబ్బెన, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రెబ్బెనలోని సాయి విద్యాలయం హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేసిన రాచర్ల సంతోష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాచర్ల సంతోష్‌ను ఎస్వీ ఇంగ్లీషు మీడియం ప్రధానోపాధ్యాయుడు సంజీవ్ కుమార్, సిబ్బంది శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమారి, తిరుపతి, హిమబిందు, మౌనిక, మంజు, దేవిక తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



ఆసిఫాబాద్‌లో నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు



కాగజ్‌నగర్ మండలం కోసినిలో..



వాంకిడిలో..

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కుమరం భీం చౌక్‌లోని మాలి సంఘం కార్యలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాలి సంఘం, ఇతర సంఘాల నాయకులు నారాయణ, రమేష్, మారుతి, కేశవ్, తిరుపతి, మెంగాజీ, మారుతి, సోమేష్ శ్రీకాంత్, నారాయణ, దత్తు, బాబురావు, తుకారాం, సాగర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్రహం జయదేవ్, కార్యదర్శి శివప్రసాద్, సంఘం సభ్యులు పురుషోత్తం కుమార్, యు నారాయణ, ఏ రాజేశ్వర్ మురారి, రామయ్య, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని కొండపల్లిలో పూలే సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూలే సేవా సమితి అధ్యక్షుడు మోర్లే తిరుపతి, సంఘం సభ్యులు వడై మధూకర్, గుర్లే సంతోష్, మోర్లే శ్రీను, మోతీరావు, సోన్లే శ్యాంరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోర్లే రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని మాలి సంక్షేమ సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు ఆదె నాందేవ్, సెండె నాందేవ్, బాబురావు, నారాయణ, గణేష్ ప్రవీన్, ప్రసాద్, సంతోష్‌రావు, నిరక్షన్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: సావిత్రిబాయి ఆశయ సాధనకు కృషి చేయాలని మాలి సంఘం మండలాధ్యక్షుడు తులసీరాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మాలి సంఘం భవనంలో సావిత్రిమాయి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణ, తిరుపతి, సోనేరావు, సుభాష్, దేవేందర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనం, జేత్వాన్ బుద్ధ విహార్‌తో పాటు వివిధ గ్రామాల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నారాయణ, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఎస్సై ప్రశాంత్, నాయకులు బాబారావు, విలాస్, వినేష్, రాజేంద్రప్రసాద్, ప్రతాప్, గుర్నలే మెంజాజీ, దుర్గం ప్రశాంత్, ఉప్రె విజయ్, రోషన్ పాల్గొన్నారు.



కెరమెరిలో నివాళులర్పిస్తున్న మాలి సంఘం నాయకులు